
సాక్షి
గుంటూరు
శనివారం ¦ 28 ¦ డిసెంబర్ ¦ 2024



ఓటింగ్ మిషన్ల తనిఖీ

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డులోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం తనిఖీ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 573.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,678 క్యూసెక్కులు వదిలారు.



ఈవీఎంల పరిశీలన

బాపట్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంల) గోడౌన్‌ను కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

జెస్సీ రాజ్‌కు ఘన స్వాగతం



విమానాశ్రయం(గన్నవరం): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బాలపురస్కార్ అవార్డు అందుకున్న గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీ రాజ్‌కు శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. న్యూఢిల్లీలో అవార్డు స్వీకరించిన తర్వాత జెస్సీ రాజ్ మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆమెకు పలువురు క్రీడా సంఘ పెద్దలు, క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

31 వరకు సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యం ఈనెల 26 నుంచి 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలను ప్రదర్శిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 31 వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని వివరించారు. వచ్చిన అభ్యంతరాలను 2025 జనవరి 6న క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామని ఆమె పేర్కొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి




నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి మోటారు సైకిళ్లను నడపాలని ఎస్పీ సతీష్ కుమార్ చెప్పారు. హెల్మెట్ వాడకంపై అవగాహన నిమిత్తం పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద మోటారు సైకిళ్ల ర్యాలీని శుక్రవారం ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వాడకంతో చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఇబ్బందులు తప్పవని చెప్పారు. హెల్మెట్‌లు ధరించి వాహనాలు నడిపితే అన్ని విధాలా ఉపయోగకరమని చెప్పారు. పోలీసులు హెల్మెట్‌లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శివకుమార్ కేసు వచ్చేనెల 16కి వాయిదా

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తోపాటు 18 మందిపై నమోదైన కేసును వచ్చేనెల 16కు న్యాయమూర్తి వాయిదా వేశారు. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వెళ్లిన సందర్భంగా జరిగిన ఘటనపై ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు శివ కుమార్‌తోపాటు మరో 18 మందిపై తెనాలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కేసు కావడంతో గుంటూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. శుక్రవారం ఈ కేసు విచారణ చేపట్టిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వచ్చేనెల 16కు వాయిదా వేశారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ తరఫున బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బార్ మాజీ అధ్యక్షుడు పాలూరి వెంకటరెడ్డి, న్యాయవాదులు జి.కృష్ణారావు, మొండితోక శ్రీనివాసరావు వకాల్తీ నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రతిభావంతులైన విద్యార్థులు తయారవుతున్నారని సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అర్షియా ఫాతిమాను శుక్రవారం ఆమె అభినందించారు. ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థిని అర్షియా ఫాతిమా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంతో పాటు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.



పొన్నూరులో నిరసన వ్యక్తం చేస్తున్న అంబటి మురళీకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు



తెనాలిలో ప్రదర్శన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

మహోగ్రమై ప్రజ్వరిల్లే

గుంటూరు జిల్లా శుక్రవారం మహోగ్రమై ప్రజ్వరిల్లింది. కూటమి సర్కారు ద్వంద్వనీతిపై ధ్వజమెత్తింది. నయవంచక పాలనపై గళమెత్తింది. జనకంటక ప్రభుత్వానికి ఇది ప్రళయ సంకేతమని గర్జించింది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుజ్జ్వాలై రగిలింది. విద్యుత్ కార్యాలయాల వద్దకు ఊరూవాడా కదంతొక్కింది. 'సర్దుబాటు' బాబూ ఖబడ్దార్.. ఇక 'సర్దు'కో బాబూ అంటూ నినదించింది. కుటిల కూటమికి చరమగీతం తప్పదని హెచ్చరించింది.

కూటమి సర్కారును బలంగా తాకిన 'విద్యుదాఘాతం'

వైఎస్సార్ సీపీ విద్యుత్ పోరుబాట విజయవంతం

సర్దుబాటు బాబూ.. ఇక 'సర్దు'కో బాబూ!

- కదంతొక్కిన ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు
- గళమెత్తి గర్జించిన ఊరూవాడా
- ఆందోళనలతో అట్టుడికిన గుంటూరు జిల్లా

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ శుక్రవారం చేపట్టిన నిరసన కార్యక్రమాలు గుంటూరు జిల్లా వ్యాప్తంగా దిగ్విజయమయ్యాయి. నియోజకవర్గ కేంద్రాల్లో ఆగ్రహ జ్వాలలు ఎగసిపడ్డాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులతోపాటు ప్రజలూ స్వచ్ఛందంగా ఆందోళనల్లో పాల్గొన్నారు. వినూత్న కార్యక్రమాలతో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సర్దుబాటు చార్జీల పేరుతో రూ.వేల కోట్ల భారం మోపటంపై మండిపడ్డారు.

➡ వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. పార్టీ గుంటూరు, పల్నాడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లాంతర్లు పట్టుకుని పెరిగిన విద్యుత్ ధరలపై నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్‌శాఖ జిల్లా ఎస్ఈ పి.మూర్తికి వినతిపత్రం అందజేశారు. ముందుగా ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

➡ తెనాలి పట్టణం చెంచుపేటలోని విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ముందుగా చెంచుపేట నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో నినాదాలు చేసి, అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతిసంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, దుబాయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

➡ పొన్నూరు పట్టణంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. ముందుగా కార్యకర్తలతో అంబటి సమావేశమయ్యారు. భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులతో పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

➡ ప్రత్తిపాడులోని గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డులో ఉన్న మహానేత డాక్టర్ వైఎస్సార్ కాంస్య విగ్రహం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అక్కడ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తరువాత ఏఈ గౌతమ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నూనె ఉమామహేశ్వరరెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి, బాపతు వెంకటేశ్వరరెడ్డి, ఖాశింపీరా, ఓంప్రకాష్ రెడ్డి, బాపతు వెంకటరమణ, పరమారెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో విద్యుత్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మోదుగుల వేణుగోపాలరెడ్డి, నూరి ఫాతిమా

➡ మంగళగిరి పట్టణం కొప్పురావు కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అంతకుముందు నాయకులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పార్టీ నేత ఈదులుమూడి డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

➡ తాడికొండ అడ్డరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, గుంటూరు నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. సాధారణ జనజీవనానికి ఆటంకం కలగకుండా రోడ్డుపక్కన టెంట్, కుర్చీలు వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. టెంట్, కుర్చీలను తొలగించి కాలువలో పడేశారు. దీనిపై స్పందించిన డైమండ్‌బాబు తాడికొండ సీఐ కె.వాసుతో మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్షంపై ఇలా వ్యవహరించటం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నయవంచకుడు చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: సీఎం చంద్రబాబు నయవంచకుడని, అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే ఆయన నిజస్వరూపం బయటపడిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. బాబుకు ఓట్లేసిన ప్రజలు తప్పు చేశామని బాధపడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు గుజ్జనగుండ్లలో విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయం వద్ద పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. అంబటి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యమకారులపై కాల్పులు జరిపించి అమాయకుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్న నరరూప రాక్షసుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ నిరంతర పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న అంబటి రాంబాబు, మనోహర్ నాయుడు

జగన్‌కు అమిత ప్రజాదరణ

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా జనం బ్రహ్మరథం పడుతున్నారని అంబటి చెప్పారు. ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేసిన ఘనత జగన్ సొంతమన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, ఈచంపాటి వెంకట కృష్ణ, పడాల సుబ్బారెడ్డి, షేక్ రోషన్, బూసి రాజలత, గురవయ్య, వైసీపీ నాయకులు సూరసాని వెంకట్‌రెడ్డి, మామిడిరాము, వంగల వలివీరారెడ్డి, మండేపూడి పురుషోత్తం, బత్తుల దేవానంద్, కరీంబేగ్, ఉడతా కృష్ణ, సాంబశివరావు, మాదాసు భాగ్యారావు, ఆటో యూనియన్ నేత మురళి పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈఈ నాసరయ్యకు వినతి పత్రం సమర్పించారు.



తాడికొండ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న డైమండ్‌బాబు, వైఎస్సార్ సీపీ శ్రేణులు



ప్రత్తిపాడు సబ్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



మంగళగిరిలో నిరసన తెలియజేస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి, మురుగుడు హనుమంతరావు, నాయకులు



గుంటూరులో లాంతర్లతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న మహిళలు, పార్టీ కార్యకర్తలు

నేడు 'చాంబర్' ఎన్నికలు

ఫలించని కూటమి ఏకగ్రీవ ప్రయత్నాలు



జిన్నాటవర్ కూడలిలోని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిన్నా టవర్ కూడలిలోని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఉదయం 8 గంటలకు కార్యాలయంలో జరగనున్న సర్వసభ్య సమావేశం, అనంతరం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. వ్యాపార వర్గాల ఓటర్లు చాంబర్ నుంచి పంపించిన సంవత్సరపు పుస్తకం, ఆధార్‌కార్డు చూపించడంతోపాటు పేరు చెబితే ఓటర్ల జాబితాను పరిశీలించి ఓటు హక్కు కల్పిస్తామని కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. సాయంత్రం ఐదు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని వివరించాయి. ఒక్కొక్క వ్యాపార ఓటరు 29 ఓట్లు వేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఓటర్ల కోసం తాగునీటి సదుపాయం కల్పించారు.

పోటాపోటీ..

చాంబర్ అధ్యక్ష పదవిని చేజిక్కించుకునేందుకు టీడీపీ నాయకులు యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ, రంగా రామకృష్ణ పోటీపడుతున్నారు. రంగా బాలకృష్ణ, యేల్చూరి వెంకటేశ్వర్లు మధ్య పోటీ హోరాహోరీగా ఉంది. ఎవరికి వారే వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఓటర్లకు వాయిస్ మెసేజ్‌లను వాట్సాప్ ద్వారా పంపించారు. అయితే యేల్చూరి వెంకటేశ్వర్లు ప్యానెల్‌ను ఏకగ్రీవం చేసేందుకు కూటమి నేతలు చేసిన యత్నాలు ఫలించలేదు. దీంతో పోటీ అనివార్యమైంది. శనివారం సాయంత్రానికి ఓట్ల లెక్కింపు పూర్తిచేసి, నూతన అధ్యక్షుడిని రాత్రికి ప్రకటించనున్నారు.

మన్మోహన్‌తో యలమంచిలి అనుబంధం

- రాజ్యసభలో పరిచయంతో స్నేహం
- సెమినార్లకు వచ్చినప్పుడు శివాజీ ఇంట్లోనే సింగ్ బస
- ఆప్తమిత్రుడి అంత్యక్రియలకు ఢిల్లీ వెళ్లిన యలమంచిలి



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో రాజ్యసభ మాజీ సభ్యులు యలమంచిలి శివాజీ (ఫైల్)


లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దేశ మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొనడానికి శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యులు, డాక్టర్ యలమంచిలి శివాజీ ఢిల్లీ వెళ్లారు. మన్మోహన్ సింగ్‌తోపాటు శివాజీ రాజ్యసభ సభ్యులుగా కొనసాగారు. అప్పట్లో రాజ్యసభలో ఇద్దరూ పక్కపక్క సీట్లలో కూర్చునేవారు. దీంతో మన్మోహన్ సింగ్‌తో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. ఆయనకు ఆప్తమిత్రుడిగా శివాజీ కొనసాగుతూ వచ్చారు. వాజ్‌పేయ్ ప్రధానిగా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో మూడుసార్లు జరిగిన సెమినార్లలో మన్మోహన్ సింగ్ పాల్గొన్నారు. అప్పట్లో మూడుసార్లు గుంటూరులోని యలమంచిలి శివాజీ ఇంటిలోనే మన్మోహన్ సింగ్ బస చేశారు. మన్మోహన్ మరణంతో యలమంచిలి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లారు. శివాజీతోపాటు పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ కూడా ఢిల్లీ వెళ్లారు.

హంస క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ఏపీ హంస(హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు జి.నాగవర్ధన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఏపీ హంస క్యాలెండర్ 2025ను శుక్రవారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం హంస యూనియన్ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.కిరణ్, నరేంద్ర, ఎల్.శ్రీనివాస్, వీరప్రసాద్, ఝాన్సి, జాన్‌బేకర్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1,616 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1,410 క్యూసెక్కులు వదిలారు.

క్లుప్తంగా

రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా ఫెన్సింగ్ జట్టు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈనెల 28, 29 తేదీల్లో కాకినాడలో జరగనున్న 10వ ఏపీ అంతర్ రాష్ట్ర పోటీలకు అండర్–17 బాల బాలికల జిల్లా ఫెన్సింగ్ జట్టును ఎంపిక చేశామని గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి గురువారం జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించామని వెల్లడించారు.

ఎంపికైన జట్టు సభ్యులు : ఫాయిల్ బాయ్స్ విభాగం: ఎ.శ్రీనివాసరావు, జోయల్ డేవిడ్ మ్యాథ్యూ, ఎ.సాయి చరణ్, బి.ప్రతాప్ కుమార్, ఈపీపీఈ విభాగం: ఈశ్వర్ పూర్ణ సాయి, బి.తనూజ్, ఆర్.సుశాంత్, ఎం.భార్గవ్, సాబెర్ విభాగం: ఎస్.కిరణేశ్వర్ రెడ్డి, బి.ఆదిత్య సాయి, డి.డానియల్ నిహాల్, ఎస్‌కె లియఖత్, బాలికల విభాగం: షేక్ ఫాతిమున్నీసా.

మన్మోహన్ సింగ్ సేవలు ఎనలేనివి



చేబ్రోలు: దేశానికి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అందించిన సేవలు ఎనలేనివని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య కొనియాడారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు శుక్రవారం నివాళులు అర్పించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్‌బీఐ గవర్నర్‌గా, యూజీసీ చైర్మన్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా దేశ పురోభివృద్ధికి వెలకట్టలేని సేవలందించిన మన్మోహన్ సింగ్ అమోఘ ఖ్యాతి గడించారన్నారు. మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక గొప్ప నేతను కోల్పోయిందని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పార్టీలతో ప్రమేయం లేకుండా ఆయన నాయకత్వం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు. మన్మోహన్ దార్శనికుడని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలి

కలెక్టర్ నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో పరిశ్రమలు స్థాపించే వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి మార్గాలు పెరుగుతాయన్నారు. ముఖ్యంగా యువతను, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్క్, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. సింగిల్ విండో ద్వారా అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలన్నారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మంగళగిరిలో ఏర్పాటు చేయనున్న గోల్డ్ క్లస్టర్, హ్యాండ్లూమ్ క్లస్టర్‌ల డీపీఆర్‌లు తయారు చేసి అనుమతులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో వివిధ పరిశ్రమల రాయితీలకు సంబంధించి 26 క్లెయిమ్స్‌కు రూ.2.38 కోట్లు మంజూరు చేస్తూ సమావేశం ఆమోదించింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఎ.జయలక్ష్మి, కమర్షియల్ టాక్స్ డీసీ బి.హిజ్జా మనోరమ, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, డీపీఓ సాయి కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలి

గర్భస్థ లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అయ్యే కొత్త స్కానింగ్ సెంటర్లు, రెన్యూవల్స్‌ను తప్పనిసరిగా ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 24 స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్‌లు నిర్వహించామన్నారు. జిల్లాలో మొత్తం 296 గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. వాటిలో నాలుగు రెన్యూవల్స్‌కు, తొమ్మిది మోడిఫికేషన్‌కు, ఒకటి క్యాన్సిలేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు. కొత్తగా మూడు స్కానింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయని, వాటిని కమిటీ సభ్యులు, ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేశారని పేర్కొన్నారు. సమావేశంలో రెండో అడిషనల్ జడ్జి డాక్టర్ వై.నాగరాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, కమిటీ సభ్యులు డాక్టర్ సుజాత, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ రవీంద్రనాయక్, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ గేటుకు తాళాలు

- ఇనుపవైర్లతోనూ గేట్లు కట్టేసిన వైనం
- అధికారుల అత్యుత్సాహం
- వైఎస్సార్ సీపీ శ్రేణులు వస్తున్నారని దుశ్చర్య
- డిమాండ్లతో కూడిన పత్రం ఇవ్వకుండా చేసేందుకు పన్నాగం
- స్థానికులు ప్రశ్నించడంతో తాళాలు తీసిన సిబ్బంది
- కూటమి నేతల ప్రసన్నం కోసమేనని విమర్శలు



విద్యుత్ సబ్ స్టేషనుకు మెయిన్ గేట్ మూసి వేసి తాళాలు వేయించిన విద్యుత్‌శాఖ అధికారులు

ప్రత్తిపాడు: విద్యుత్ సబ్‌స్టేషన్ మెయిన్ గేటుకు తాళాలు వేయించి విద్యుత్‌శాఖ అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ఏ అధికారీ వ్యవహరించని విధంగా వ్యవహరించి విమర్శలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ పోరుబాటకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు నిరసన ర్యాలీగా సబ్ స్టేషన్‌కు బయల్దేరారు. విషయం తెలుసుకున్న ఏఈ గౌతమ్ తమ సిబ్బందితో విద్యుత్ సబ్ స్టేషన్ మెయిన్ గేట్‌కు తాళాలు వేయించారు. ఎవరూ లోపలకు రాకుండా ఇనుప వైర్లతో గేట్లు కట్టివేశారు. ఇంతలో అక్కడకు చేరుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, మీడియా ప్రతినిధులు గేట్లుకు తాళాలు వేసి ఉండడంతో అవాక్కయ్యారు. స్థానికులు సిబ్బందిని ప్రశ్నించడంతో ఏఈ తాళాలు వేయమన్నారని చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో సిబ్బంది హడావుడిగా వచ్చి తాళాలు తీశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు డిమాండ్లతో కూడిన పత్రం ఇవ్వడానికి వస్తున్నందునే ఇలా తాళాలు వేశారని ఆ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. కూటమి నాయకుల మెప్పు పొందడంతోపాటు వారి కళ్లలో ఆనందం చూసేందుకే విద్యుత్ అధికారులు ఇలా కార్యాలయానికి గతంలో ఎన్నడూ లేని విధంగా తాళాలు వేయించారనే విమర్శలు వెల్లువెత్తాయి.

ఉత్తరాఖండ్ డిఫెన్స్ లిక్కర్ స్వాధీనం

- దుస్తుల దుకాణం పేరుతో పార్శిల్లో వచ్చిన మద్యం
- 70 సీసాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): దుస్తుల దుకాణం పేరుతో పార్శిల్‌లో ఉత్తరఖండ్ నుంచి డిఫెన్స్ మద్యాన్ని గుంటూరుకు తీసుకువచ్చి వడ్లమూడి గ్రామంలో అధిక ధరలకు అమ్మేందుకు తీసుకువెళుతున్న ఆర్మీ రిటైర్డ్ హవాల్దార్‌ను, అతనితోపాటు మరొక వ్యక్తిని, ఒక ఆటోను, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇ.మారయ్య బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు ఎక్సైజ్–2 స్టేషన్‌లో పోలీసులు నిందితుల వివరాలు వెల్లడించారు. వడ్లమూడి గ్రామానికి చెందిన బాలాజీ బాబు సింహాద్రి ఆర్మీ హవాల్దార్‌గా ఉత్తరఖండ్ రాష్ట్రంలో పనిచేసి రిటైర్ అయ్యాడు. అక్కడ ఉన్న పరిచయాలతో డిఫెన్స్ మద్యాన్ని పార్శిల్ రూపంలో గుంటూరుకు తీసుకువచ్చి వడ్లమూడిలో అమ్ముతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉత్తరాఖండ్ నుంచి గుంటూరుకు దుస్తుల దుకాణం పేరుతో ఒక పార్శిల్‌లో తీసుకొచ్చి ఇక్కడి నుంచి ఆటోలో వడ్లమూడికి తరలిస్తున్నారన్న సమాచారంతో తెల్లవారుజామున దాడి చేసి బాలాజీబాబు సింహాద్రి, బొలగాని వెంకటేశ్వరరావును అరెస్టుచేసినట్టు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 750 ఎంఎల్ పరిమాణం గల 70 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ యశోధర దేవి, ఎస్ఐ కె.సత్యనారాయణ, సిబ్బంది హనుమంతరావు, ఎం.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, జె.వెంకటేశ్వరరావు, ప్రసాద్, రవిబాబు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

బెల్లంకొండ: ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం మాచవరం మండలం రుక్మిణిపురం గ్రామానికి చెందిన బాణావతు అశోక్ కుమార్ నాయక్(32) గురువారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా పాపాయపాలెం శివారులో బైక్‌పై ఎదురుగా వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్ గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

సీఏలో మాస్టర్‌మైండ్స్ విద్యార్థికి ఆలిండియా ఫస్ట్ ర్యాంకు



మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఈనెల 26న ప్రకటించిన సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థి రిషబ్ ఓత్స్వాల్ అఖిల భారతస్థాయిలో 1వ ర్యాంకర్‌గా నిలిచినట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. శుక్రవారం గుంటూరు బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మోహన్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ ఎంఈసీ నుంచి మాస్టర్‌మైండ్స్‌లో చదివిన విద్యార్థి రిషబ్ ఓత్స్వాల్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలవడం గర్వకారణమన్నారు. ఐసీఏఐ ప్రకటించిన టాప్–50 ర్యాంకుల్లో తమ విద్యార్థులు నాలుగు ర్యాంకులను కైవసం చేసుకున్నారని వివరించారు. ముంజులూరి మోహన్‌కృష్ణ 33వ ర్యాంకు, కేసన సాయి చరణ్ 34వ ర్యాంకు, కాకుమాను కృష్ణ చైతన్య 40వ ర్యాంకు సాధించారని చెప్పారు. వివిధ కామర్స్ కోర్సుల్లో మాస్టర్‌మైండ్స్ ఇప్పటి వరకు 50 సార్లకు పైగా ఫస్ట్ ర్యాంకును కైవసం చేసుకుందని వివరించారు. అత్యుత్తమ ఫలితాలను సాధించడంలో సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ఆర్టీసీ అప్రెంటీస్ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ఏపీఎస్ఆర్టీసీ అప్రెంటీస్‌షిప్ చేసేందుకు నవంబరు 6 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన తేదీలను ఖరారు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని డాక్యుమెంట్ సక్రమంగా అప్‌లోడ్ చేయని అభ్యర్థుల వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్‌సీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామని, వీరు విభాగాల వారీగా సూచించిన తేదీల్లో విజయవాడలోని విద్యాధరపురం చెరువు సెంటర్ వద్ద ఉన్న ఆర్టీసీ శిక్షణ కళాశాల వద్దకు ఉదయం 10 గంటలకు విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలతో రావాలని వివరించారు. శనివారం నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం 7382900591, 7282900299, 7989790054 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

47,832 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 41,094 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,832 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,400 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 40,899 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

బాలుడిపై కత్తితో దాడి



గాయపడిన బాలుడు శ్రీనివాసరావు

బెల్లంకొండ: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమనడంతో బాలుడిపై కత్తితో దాడికి పాల్పడి గాయపరిచిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై డి.ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొజ్జా శ్రీనివాసరావు(17) వద్ద అదే గ్రామానికి చెందిన మన్నేపల్లి పిచ్చయ్య కొద్దిరోజుల కిందట రూ.200 అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడగడంతో ఇరువురి మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో గ్రామంలోని మద్యం దుకాణం వద్ద కనిపించడంతో పిచ్చయ్యను డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న పిచ్చయ్య శ్రీనివాసరావు మెడపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు వెంటనే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ఊరుకోం

అడ్డుకున్న సీపీఎం నాయకులు



స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వచ్చిన వారిని అడ్డుకుంటున్న నళినికాంత్ తదితరులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఊరుకోబోమని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు నగరం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం సమీపంలో స్మార్ట్(ప్రీపెయిడ్) మీటర్లు బిగించడానికి వచ్చిన సిబ్బందిని నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఇళ్ల యజమానులకు తెలియకుండా మీటర్లు బిగిస్తే ఊరుకోబోమని హెచ్చరించడంతో సిబ్బంది వెనుదిరిగారు. అనంతరం కె.నళినీకాంత్, విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ షేక్ అబ్దుల్ సలీమ్ మాట్లాడుతూ ఇప్పటికే ట్రూఅప్, విద్యుత్తు సుంకం, ఇంధన సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచిన ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లతో పెనుభారం మోపేందుకు యత్నిస్తోందని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని చంద్రబాబు, లోకేష్ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చి స్మార్ట్‌మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు, నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశిం షహీద్, జి.లూథర్ పాల్, షేక్ ఖాశిం వలి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆత్మీయ సమ్మేళనం



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చిలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును మళ్లీ గెలిపించుకోవాలని కోరుతూ ఈనెల 29న మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరులోని ఎన్జీఓ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కళాధర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, ఉద్యోగ, కార్మిక సంఘాల గొంతుకగా పనిచేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీగా గెలిచిన నాటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, నిరుద్యోగ సమస్యలపై శాసనమండలి లోపల, వెలుపల ప్రభుత్వాలతో లక్ష్మణరావు పోరాటం చేస్తున్నారని, ఆయనను మళ్లీ గెలిపించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు సలీం, ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ చిష్టీ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్ రావు, జి.వెంకటేశ్వరరావు, ప్రేమ్ కుమార్, ఆదినారాయణ, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు జి.వెంకట్రావు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కృష్ణానదిలో చేప పిల్లలను వదులుతున్న అధికారులు

తాడేపల్లిరూరల్ : మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు జిల్లా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి చెప్పారు. శుక్రవారం ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో పడవల రేవు వద్ద కృష్ణా మీనోత్సవంలో భాగంగా నదిలో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీకుమారి, జిల్లా మత్స్యశాఖ అధికారి గాలిదేవుడు, తాడేపల్లి తహసీల్దార్ డి.సీతారామయ్య అధికారులతో కలిసి నదిలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమారి మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా 12.50 లక్షల చేపపిల్లలను వదిలామని తెలిపారు. కార్యక్రమంలో నిడుబ్రోలు ఎఫ్‌డీవో ఎం.డి.జయినుల్లా ఖాన్, గుంటూరు ఎఐఎఫ్ అధికారి కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లక్ష్మీనారాయణ కుంకుమ పూజ



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



మాట్లాడుతున్న శ్రీఅష్టాక్షరీ జీయర్‌స్వామి

తెనాలి: శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళ శాసనాలతో ఇక్కడ జరుగుతున్న శ్రీధనుర్మాస వ్రత ప్రయుక్త దీక్షా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీనారాయణ కుంకుమ పూజను నిర్వహించారు. మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీఅష్టాక్షరీ జీయర్‌స్వామి మాట్లాడుతూ మానవ జన్మ అత్యున్నతమైనదని చెప్పారు. ఈ జన్మను సార్థకం చేసుకోవటానికి గోదాదేవి వ్రతం విశిష్టమైనదని చెప్పారు. శ్రీశరణాగతి గోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనరేంద్రరామానుజ దాసస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆర్టీసీ బస్‌స్టేషను–వీఎస్సార్ కాలేజి రోడ్డులో ఈ వేడుకలు జరుగుతున్న విషయం తెలిసిందే. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

పారదర్శకంగా నిర్వహిస్తాం

- అర్హత సాధించిన అభ్యర్థులు 9,084 మంది
- పురుషులు 7,483 మంది, స్త్రీలు 1,601 మంది



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్ఆర్‌బీ) చేపట్టిన ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ మేజర్మెంట్ పరీక్ష (పీఎంటీ), ఫిజికల్ ఎఫీషియన్సీ పరీక్షలు (పీఈటీ) పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 30 నుంచి వచ్చేనెల 22 వరకు జరపనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు కేటాయించిన నిర్ణీత వేళలు ఉదయం ఐదు గంటల నుంచి పది గంటలులోపు గ్రౌండ్‌కు రావాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 9,084 మంది దేహదారుఢ్య పరీక్షలకు అర్హత సాధించగా, అందులో 7,483 మంది పురుషులు, 1,601 మంది స్త్రీలు ఉన్నారని వివరించారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన, బయోమెట్రిక్ ఆథెంటిఫికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు(ఛాతీ, ఎత్తు కొలత), ఫిజికల్ ఎఫీషియన్సీ పరీక్షలు (1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్), వెరిఫికేషన్ – 2 (స్పెషల్ బెనిఫిట్స్ – లోకల్ స్టేటస్), రిజల్ట్ కౌంటర్ వరకు ప్రతి స్థాయిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అంబులెన్స్, వైద్యులను అందుబాటులో ఉంచనున్నట్టు వివరించారు.